సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023

న్యూస్‌రీల్

సింహగిరిపై భారీ షెడ్ ప్రారంభం



షెడ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

సింహాచలం: సింహగిరిపై మాడ వీధుల్లో భక్తులకు నీడ కల్పించేందుకు లారస్ ల్యాబ్ సహకారంతో సుమారు రూ.2కోట్లతో నిర్మించిన భారీ షెడ్‌ను డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. సింహగిరిపై తూర్పు, ఉత్తర మాడవీధుల్లో భక్తులకు నీడ కల్పించేందుకు 27 అడుగుల ఎత్తులో, 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్‌ను నిర్మించారు. ఎండ వేడిమికి తట్టుకునేలా తెల్లని పైకప్పు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, అన్నవరం ఈవో చంద్రశేఖర్ ఆజాద్, దేవదాయశాఖ ఆర్‌జేసీ సురేష్‌బాబు, ఏసీ శిరీష, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, లారస్ ల్యాబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు రూ.14 లక్షల వెండి సామగ్రి బహూకరణ



ఈవోకు వెండి పూజా సామగ్రిని అందజేస్తున్న దాత నంద విపుల

సింహాచలం: చందనోత్సవం పురస్కరించుకుని వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి రూ.14.20లక్షలు విలువైన 16 కిలోల వెండి పూజా సామగ్రిని లాసన్స్‌బే కాలనీకి చెందిన కె.నంద విపుల అనే దాత బహూకరించారు. సహస్రధార, చక్రధార, శంఖధార, అష్టలక్ష్మీ పళ్లెం, హంస పళ్లెం, చాపుదార్ దుడ్లు తదితర పూజా సామగ్రిని దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు అందజేశారు. వరాహ లక్ష్మీ నృసింహస్వామిపై ఉన్న భక్తిభావంతో వీటిని కానుకగా అందించినట్లు దాత తెలిపారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు, ఉద్యోగులు వరహాలరావు, నాయుడు పాల్గొన్నారు.

మరో 10 మందికి కరోనా

మహారాణిపేట: విశాఖ జిల్లాలో శనివారం మరో 10 కరోనా కేసులు నమోదయ్యాయి. కొద్ది రోజులుగా వరసగా కేసులు పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో 252 మందికి పరీక్షలు నిర్వహించగా.. 10 మందికి కరోనా నిర్ధారణ జరిగింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 35కి చేరింది. ఐదుగురు డిశ్చార్జ్ అయ్యారు. 30 మంది హోం ఐసోలేషన్‌లో, ఐదుగురు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీ నగరపాలెం

తగరపువలస: రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీగా భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామ పంచాయతీ ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా 9 విభాగాల్లో 27 పంచాయతీలకు పురస్కారాలు అందించనున్నారు. వీటిలో 'మంచి పాలనతో పంచాయతీ' విభాగంలో నగరపాలేనికి రెండో స్థానం లభించింది. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగే కార్యక్రమంలో సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమి పురస్కారం అందుకోనున్నారు. పురస్కార క్యార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి కూడా హాజరవుతారు. అదే రోజు జిల్లా స్థాయి, మండల స్థాయిలో కూడా 9 విభాగాల్లో 27 పురస్కారాలు అందించనున్నారు.

చందన సేవకు వేళాయె

- నేడే సింహాద్రి అప్పన్న చందనోత్సవం
- ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం
- శోభాయమానంగా సింహగిరి



పూల అలంకరణలో ప్రహ్లాద మండపం



విద్యుద్దీపాలంకరణతో ధగధగలాడుతున్న సింహగిరి

సింహాచలం: దుష్టసంహారానికి ఉగ్రరూపధారియైన నృసింహుడు భక్తుల అభీష్టం నెరవేర్చేందుకు అనేక చోట్ల స్వయంభువుగా వెలిశాడు. అలాంటి ప్రసిద్ధ క్షేత్రాలలో సింహగిరి ఒకటి. తూర్పు కనుమలలో ప్రకృతి సౌందర్యం నడుమ సింహాద్రిపై పశ్చిమాభిముఖుడైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహుడు అశేష భక్తకోటికి ఇష్టదైవం. వైశాఖ శుద్ధ తదియ నాడు భక్తజనకోటికి నిజరూప దర్శనం అనుగ్రహిస్తాడు. చందన యాత్ర నాడు నిజరూపం దర్శనం వైకుంఠంలో లక్ష్మీనారాయణులను దర్శించినంత ఫలితమని క్షేత్ర మహాత్మ్యం పేర్కొంటోంది.

ఆదివారం జరగనున్న చందనోత్సవానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి ఆలయ అర్చకులు వైదిక కార్యక్రమాలు ప్రారంభిస్తారు. స్వామివారిపై ఉన్న చందనాన్ని శాస్త్రోక్తంగా ఒలిచి నిజరూప భరితున్ని చేస్తారు. అనంతరం దేవస్థానం వంశపార ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకి తొలిదర్శనం కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. టీటీడీ తరపున సంప్రదాయ వస్త్రసమర్పణ ఉంటుంది. ఉదయం 4 గంటల నుంచి సర్వదర్శనం భక్తులకు అందజేస్తారు. రాత్రి 7 గంటల వరకే భక్తులను క్యూల్లోకి అనుమతిస్తారు. తరువాత క్యూల ప్రవేశ ద్వారాలు మూసివేసి అప్పటి వరకు క్యూల్లో ఉన్న భక్తులకు స్వామివారి దర్శనాన్ని కల్పిస్తారు. రాత్రి 8.30 గంటల నుంచి పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితులు త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో స్వామికి సహస్రఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. సింహగిరిపై ఉన్న గంగధార వద్ద నుంచి శ్రీవైష్ణవ స్వాములు కలశాలతో నీటిని తీసుకురాగా స్వామికి అభిషేకం చేస్తారు. పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి విశేష పూజలు నిర్వహించిన అనంతరం స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని సమర్పిస్తారు.



చందనోత్సవం బందోబస్తుకు వచ్చిన పోలీసులు

పకడ్బందీ ఏర్పాట్లు

ఈసారి 1.50 లక్షల మంది భక్తులు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. సర్వదర్శనంతో పాటు రూ.300, రూ.1000 దర్శనం టికెట్లు, రూ.1500 వీవీఐపీల టికెట్లు అందుబాటులో ఉంచారు. తొలిసారిగా రూ.300, రూ.1000 టికెట్లు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిపారు. కాగా రూ.300 దర్శనం టికెట్లపై వేచ్చేవారికి కూడా వివిధ స్లాట్‌ల్లో దర్శన సమయాన్ని కేటాయించారు. కలెక్టర్ మల్లికార్జున, దేవస్థానం ఈవో త్రినాథరావు, జీవీఎంసీ, ఫైర్, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్, పోలీస్, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. కాగా నగర పోలీస్ కమీషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ ఆధ్వర్యంలో పన్నెండు వందలకి పైగా పోలీసులు చందనోత్సవం బందోబస్తు నిర్వహించనున్నారు. చందనోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని ప్రహ్లాదమండపాన్ని విశేషంగా పూలతో అలంకరించారు.

చందనంలో సుగంధ ద్రవ్యాల మేళవింపు

చందనోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చిచందనంలో శనివారం దేవస్థానం అర్చకులు పలు రకాల సుగంధ ద్రవ్యాలను కలిపారు. ఈ చందనాన్ని ఆదివారం రాత్రి సహస్ర ఘటాభిషేకం అనంతరం స్వామికి సమర్పించనున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



చందనంలో సుగంధ ద్రవ్యాలను కలుపుతున్న అర్చకులు

గోశాల, అడవివరం వరకు 56 ఉచిత బస్సులు

డాబాగార్డెన్స్: చందనోత్సవానికి ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసిన నేపథ్యంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ బి.అప్పలనాయుడు శనివారం సింహాచలం బస్ స్టాప్ వద్ద సిబ్బందికి పలు సూచనలు చేశారు. సుమారు 160 బస్సులు గోశాల వరకు తిప్పేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. అలాగే కొండపై నుంచి గోశాల, అడవివరం వరకు 56 బస్సులు ఉచితంగా నడపనున్నట్టు చెప్పారు. బస్ స్టేషన్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.

ఈద్ ముబారక్



మహిళా కళాశాల ఎదురుగా సర్వీస్ రోడ్డులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు



సందేశం ఇస్తున్న ఖాసీం రజా మౌలానా

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

డాబాగార్డెన్స్: రంజాన్ పండగను ముస్లింలు శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం రాత్రి నెలవంక దర్శనంతో ఉపవాసాలు విరమించారు. మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంతోషంగా ఈద్-ఉల్-ఫితర్ జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. జగదాంబ జంక్షన్ సమీపంలోని మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్ చదివి వినిపించారు. నమాజ్‌కు ముందు పేదలు, అనాథలకు ఫిత్రా, జకాత్ దానాలు చేశారు. విశాఖ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా గల సర్వీస్ రోడ్డులో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈదుల్ ఫితర్ నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజీ ఖాసీం రజా మౌలానా 30 రోజుల ఉపవాసం వల్ల ఆధ్యాత్మిక భావనతో పాటు ఎదుటివారి ఆకలి బాధను అర్థం చేసుకోగలరన్నారు. దీని వల్ల ఎదుటివారిపై ప్రేమ, అభిమానం పెరుగుతుందన్నారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు హైదర్ అలీసింకా, ఉపాధ్యక్షుడు మీర్ అబ్బాస్ హుస్సేన్, కార్యదర్శి అబీర్‌జాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ రహ్మతుల్లా, కోశాధికారి ఎస్‌కే అహ్మద్ వల్లీ, మెహబూబ్ ఆలీఖాన్ పాల్గొన్నారు.

టికెట్ల జారీలో గందరగోళం



దేవస్థానం కార్యాలయం వద్ద రూ.1500 టికెట్ల కోసం సిఫార్స్ లేఖలతో వచ్చిన వీఐపీలు

సింహాచలం: చందనోత్సవానికి సిఫార్సు లేఖలపై ఇచ్చే రూ.1500 టికెట్ల జారీలో శనివారం అంతా గందరగోళ పరిస్థితి నెలకొంది. ఏటా సిఫార్సు లేఖలు ఇచ్చిన వారికి వారి వారి కేడర్‌ని బట్టి టికెట్లు కేటాయించేవారు. సిఫార్సు లేఖలో నమోదు చేసిన ఫోన్ నెంబర్‌కి రెండు రోజుల ముందుగానే మెసేజ్ చేసేవారు. దాని ప్రకారం సింహాచలంలోని ఆంధ్రా బ్యాంక్, స్టేట్‌బ్యాంకుల్లో టికెట్లు జారీ చేసేవారు. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేకపోవడంతో శనివారం ఉదయం నుంచి తమకు మెసేజ్‌లు రాలేదని పెద్ద ఎత్తున దేవస్థానం ఈవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అయితే దేవస్థానం తయారుచేసిన లిస్టుల్లో పేరు ఉన్నవారికి స్లిప్‌లు రాసి ఇవ్వగా పలువురు బ్యాంకుల వద్దకు పరుగులు తీసి టికెట్లు తీసుకున్నారు. లిస్టులో చాలా మంది పేర్లు లేకపోవడంతో తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పలువురికి దేవస్థానం సమాచార కేంద్రంలో దేవస్థానం సిబ్బందే టికెట్లు జారీ చేశారు. అయితే టికెట్లు అయిపోవడంతో మళ్లీ అవి ప్రింట్ అయ్యేవరకు గంటల తరబడి నిరీక్షించారు. దీంతో చాలామంది అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆన్‌లైన్‌లో శనివారం రూ.300, రూ.1000 టికెట్ల జారీ ప్రక్రియ నడవడం లేదంటూ ఉదయం నుంచి దేవస్థానం కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకున్నారు. స్థానిక ఆంధ్రాబ్యాంకు, ఎస్‌బీఐలోనూ టికెట్లు జారీ జరుగుతుండటంతో అక్కడికి తరలివెళ్లారు. మధ్యాహ్నం నుంచి బ్యాంకుల్లో కూడా రూ.1000 టికెట్ల అయిపోయాయి. దీంతో మళ్లీ దేవస్థానం కార్యాలయానికి ప్రజలు పరుగులు తీశారు. అలాగే దేవస్థానం ఉద్యోగులకు జారీచేసే టికెట్ల ప్రక్రియ కూడా మందకొడిగా సాగడంతో ఉద్యోగులు నిరాశ చెందారు. దేవస్థానం రిటైర్డ్ ఉద్యోగులకు రెండు టికెట్లు ఇస్తామని అప్పటికప్పుడు ప్రకటించడంతో పలువురు సాయంత్రానికి కార్యాలయానికి చేరుకున్నారు. వారికి కూడా టికెట్ల జారీలో జాప్యం జరిగింది.

కూల్ కూల్!

- భానుడి భగభగల నుంచి ఉపశమనం
- గణనీయంగా తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- వడగాడ్పులకు కొన్నాళ్లు విరామం
- మూడ్రోజులు అకాల వర్షాలు, ఈదురుగాలులు
- ద్రోణి, గాలుల ప్రభావంతో మారిన వాతావరణం



ఏయూ మైదానంలో కమ్ముకున్న కారుమబ్బులు



సుడిగాలులకు మైదానంలో రేగిన ఇసుక

సాక్షి, విశాఖపట్నం: దాదాపు మూడు వారాల నుంచి భానుడు భగభగలాడుతున్నాడు. అత్యధిక ఉష్ణోగ్రతలతో జనాన్ని అల్లాడిస్తున్నాడు. మే నెలలో చవిచూసే ఉష్ణతాపాన్ని ఏప్రిల్ ఆరంభం నుంచే వెదజల్లుతున్నాడు. సాధారణంకంటే గరిష్టంగా ఏడు డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లాలోని పద్మనాభం, కోటవురట్ల ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. విశాఖ నగరంలోనూ 42 డిగ్రీల వరకు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకుంది. ఉష్ణోగ్రతలు అనూహ్యంగా తగ్గుముఖం పట్టాయి. శనివారం ఉమ్మడి విశాఖలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల (40 డిగ్రీలు నమోదు) మినహా మిగతా ప్రాంతాల్లో 38 డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనం లభించినట్టవుతోంది.

సుడిగాలి అలజడి

శనివారం సాయంత్రం వరకు విశాఖలో సాధారణ పరిస్థితే నెలకొంది. నగరంలో గరిష్టంగా 37.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం 5 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై చల్లదనం పరచుకుంది. కారుమబ్బులు కమ్ముకున్నాయి. కాసేపటికే ఈదురుగాలులు మొదలయ్యాయి. నగరంలో పలు ప్రాంతాల్లో ఇసుక, దుమ్ము ధూళితో సుడిగాలులు అలజడి సృష్టించాయి. వీటి ధాటికి వాహన చోదకులు చాలా ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు, రేకులు ఎగిరి పడ్డాయి. దట్టంగా కమ్ముకున్న మబ్బులతో భారీ వర్షం కురుస్తుందనుకున్నా.. ఈదురుగాలులు హంగామా చేయడంతో తేలికపాటి జల్లులకే పరిమితమైంది.

ఎందుకిలా?..

ప్రస్తుతం వాయువ్య మధ్యప్రదేశ్ నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మరోవైపు దక్షిణ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. ఫలితంగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. అదే సమయంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులకు కారణమవుతున్నాయి. రానున్న మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగనుంది. గంటకు 40–50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. అదే సమయంలో పిడుగులకు ఆస్కారం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

ఎక్కడ ఏమైంది?

- తగరపువలసలో గంటసేపు భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- పద్మనాభం మండలంలో ఎండబెట్టిన మొక్కజొన్నలు వర్షానికి తడిసిపోయాయి.
- పాడేరు ఘాట్, హుకుంపేట, జి.మాడుగులల్లో గంట పాటు కుండపోత వర్షం కురిసింది.
- దేవరాపల్లి మండలం నాగయ్యపేట, కె.కోటపాడు మండలం బత్తివానిపాలెంలో పిడుగుపాటుకు రెండు ఆవులు, మాడుగులలో గేదె మృతి చెందాయి.
- రావికమతం మండలంలో ఈదురుగాలులతో మామిడి పంటకు నష్టం వాటిల్లింది.



దుమ్ము మధ్యలో వాహనచోదకుల రాకపోకలు

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ

డాబాగార్డెన్స్: శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవంలో భక్తులకు ఎటువంటి లోటుపాట్లు రాకుండా జీవీఎంసీ తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన సిటీప్లానర్ సునీత, సంబంధిత అధికారులతో కలిసి శనివారం జీవీఎంసీ ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వామి నిజరూప దర్శనానికి వేలాదిగా భక్తులు తరలిరానున్న దృష్ట్యా వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపారు. తాగునీరు, విద్యుత్, పార్కింగ్, పారిశుధ్యం తదితర పనులు సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బందిచే తొలగించాలని, క్యూలో ఉన్న భక్తులకు సమృద్ధిగా తాగునీరు అందించాలనిఅధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతకు గురయ్యే భక్తులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధం ఉన్నందున క్లాత్ బ్యాగ్లనే వాడేలా చూడాలన్నారు. దాతలు, భక్తులు ఆహార పదార్థాలు, పానియాలను పేపర్ ప్లేట్లతో అందించేలా ఉండేటట్టు చూడాలన్నారు.

సమాజహితమే ఆధ్యాత్మిక లక్ష్యం

- శ్రీనివాసుని ఆశీస్సులు అందరిపై ఉండాలి
- త్రిదండి చినజీయర్‌స్వామి

మురళీనగర్: సమాజ హితమే ఆధ్యాత్మిక లక్ష్యమని త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో నిర్మించిన అలివేలు మంగమ్మ అన్న సమారాధన భవంతిని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందరికీ అందాలని ఆశిస్తున్నట్లు ఆయన అన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అభిభాషణం చేశారు. భగవంతుడు విగ్రహ రూపంలోకి వచ్చినప్పుడు అక్కడి అర్చకుడి శ్రద్ధను బట్టి వైభవాన్ని సమకూరుస్తారన్నారు. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు, నిర్వాహకుల భక్తి శ్రద్ధల వల్ల ఆలయం వైభవంగా వర్ధిల్లుతోందని చెప్పారు. వైభవుడి ఆశీస్సులు సమాజహితంగా ఉంటాయన్నారు. అన్నసమారాధన భవంతి నిర్మాణానికి సహకారం అందించిన దాతలు, భక్తులకు ఆయన ఆశీస్సులు అందించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ త్రిదండి చినజీయర్ స్వామితో కలిసి వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. చాలా రోజుల నుంచి ఉన్న కోరిక నేటికి తీరిందన్నారు. టీటీడీ స్థలంలో ఈ ఆలయాన్ని నిర్మించడం వల్ల తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పుష్కరిణి మంజూరు చేయాలని ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ముందుగా చినజీయర్ స్వామి, వైవీ సుబ్బారెడ్డిలకు ఆలయ సంప్రదాయం ప్రకారం నిర్వాహకులు స్వాగతం పలికారు. చినజీయర్ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, వి.ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, ఆలయం ఈవో బండారు ప్రసాద్ పాల్గొన్నారు.



భక్తులకు అభిభాషణం చేస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి, చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి

చందనోత్సవం.. ట్రాఫిక్ మళ్లింపు

డొండపర్తి(విశాఖ దక్షిణ): అప్పన్న చందనోత్సవానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. స్వామిని దర్శించుకోవడానికి 1.5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు. సింహాచలం వచ్చే భక్తుల కోసం ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు.

- శొంఠ్యాం వైపు నుంచి రూ.1000, రూ.300 టికెట్లతో పాటు ఉచిత దర్శనానికి వచ్చే వాహనదారులు అడవివరం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో కార్లు, ఆటోలు, టూవీలర్లు నిలపాలి. అడవివరం జంక్షన్ వద్ద దేవస్థానం అధికారులు ఏర్పాటు చేసిన ఉచిత బస్సుల్లో ప్రయాణం చేసి కొండపైకి వెళ్లాలి.
- శొంఠ్యాం నుంచి సింహాచలం వైపు భారీ వాహనాలకు అనుమతి లేదు. శొంఠ్యాం నుంచి వచ్చే భారీ వాహనాలు ఆనందపురం మీదుగా లేక పెందుర్తి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- హనుమంతవాక వైపు నుంచి ఆటోలు, కార్లు, టూవీలర్లపై వచ్చే రూ.1000, రూ.300 టికెట్ దారులతో పాటు ఉచిత దర్శనానికి వచ్చేవారు అడివివరం జంక్షన్ వద్ద పార్క్ చేసుకోవాలి.
- హనుమంతవాక నుంచి పెందుర్తి, గోపాలపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలు అడవివరం వైపు నుంచి కాకుండా ఆనందపురం నుంచి లేదా మద్దిలపాలెం మీదుగా ఎన్ఏడీ జంక్షన్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది.
- రూ.1500 టికెట్ ఉన్న వారు సిటీ నుంచి హనుమంతవాక మీదుగా ఆరిలోవ, పైనాపిల్ కాలనీ, న్యూ టోల్‌గేట్ వద్దకు చేరుకోవాలి. అక్కడ ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో కార్లను నిలపాలి. అక్కడ నుంచి బీసీ వెల్ఫేర్ హైస్కూల్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన ఏసీ బస్సుల్లో ప్రయాణం చేసి కొండపైకి వెళ్లాలి.
- గోపాలపట్నం, వేపగుంట వైపు నుంచి కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వచ్చే రూ.1000, రూ.300 టికెట్లు ఉన్న వారు, ఉచిత దర్శనం భక్తులు పాత గోశాల నుంచి సింహపురి కాలనీ వరకు ఉన్న బీఆర్‌టీఎస్ మధ్య రోడ్‌లో కార్లు నిలపాలి. ఆటోలకు సింహపురి కాలనీ నుంచి అప్పన్నపాలెం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ మధ్య రోడ్‌లో పార్కింగ్ కల్పించారు. పాత గోశాల సాయినగర్ వద్ద టూ వీలర్స్ పార్కింగ్ చేసుకోవాలి. సింహపురి కాలనీ వద్ద నుంచి గోశాల మీదుగా దేవస్థానం వారు ఏర్పాటు చేసిన ఉచిత బస్సుల్లో కొండపైకి వెళ్లాల్సి ఉంటుంది.
- గోపాలపట్నం, పెందుర్తి వైపు నుంచి వచ్చే టూ వీలర్ వాహనదారులకు కలశం జంక్షన్ దగ్గరలో ఉన్న శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి డౌన్ హిల్ వద్ద దేవస్థానం అధికారులు ఏర్పాటు చేసిన ఉచిత బస్సుల్లో ప్రయాణం చేసి కొండపైకి వెళ్లాలి.
- సబ్బవరం, కొత్తవలస వైపు నుంచి వాహనాల్లో వచ్చే భక్తులు పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, జుత్తాడ, దువ్వపాలెం జంక్షన్ మీదుగా అడవివరం చేరుకోవాలి.
- చందనోత్సవం సందర్భంగా విధులకు హాజరయ్యే పోలీసు, ఇతర అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది ద్విచక్రవాహనాలు కొండ కింద ఉన్న సింహాచలం హైస్కూల్ గ్రౌండ్ వద్ద కేటాయించిన ప్రత్యేక పార్కింగ్ ప్రదేశంలో నిలపాలి. ఉచిత ఆర్టీసీ బస్సుల్లో కొండ మీదకు చేరుకోవాలి. కొండ మీదకు ద్విచక్ర వాహనాలకు అనుమతిలేదు.
- భక్తుల కోసం దేవస్థానం ఏర్పాటు చేసిన వాహనాలు తప్పా ఇతర వాహనాలు చందనోత్సవం సందర్భంగా కొండ మీదకు అనుమతించరు.

ముగ్గురిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



యువకులను తీరానికి తీసుకొచ్చిన గార్డ్స్

కొమ్మాది: సముద్రంలో మునిగిపోతున్న యువకులను లైఫ్ గార్డ్స్ కాపాడారు. వివరాలివీ.. రాజస్థాన్‌కు చెందిన ఐదుగురు యువకులు శనివారం రుషికొండ బీచ్ చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరం వద్ద సరదాగా గడిపి.. సాయంత్రం స్నానాలు చేసేందుకు సముద్రంలోకి దిగారు. వాతావరణంలో మార్పుల కారణంగా సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ఒక్క సారిగా కెరటాలు బలంగా రావడంతో వీరంతా చిక్కుకున్నారు. వీరిలో ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మిగిలిన ప్రశాంత్, సిద్దార్థ్, అక్షత్ మునిగిపోతున్న క్రమంలో లైఫ్‌గార్డ్స్ గమనించారు. వెంటనే అప్రమత్తమై సురక్షితంగా వారిని తీరానికి తీసుకొచ్చారు. ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఏయూతో కూర్మ ఐటీ సొల్యూషన్స్ ఎంవోయూ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కూర్మ ఐటీ సొల్యూషన్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, కూర్మ ఐటీ సొల్యూషన్స్ సీఈవో పి.అప్పలనాయుడు సంతకాలు చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఆచార్య ఎస్.బాలప్రసాద్, పి.అచ్యుత సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు. అవగాహన ఒప్పందంలో భాగంగా పర్యావరణ సంబంధంగా ఏయూ నిర్వహించే పలు పరిశోధన ప్రాజెక్టుల్లో అవసరమైన సాంకేతిక సహకారం కూర్మ ఐటీ సొల్యూషన్స్ సంస్థ అందిస్తుంది.